www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

వాక్కుల ద్వారము
తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య బట్టు గంగారావు
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్


సంపుటి : 1 | సంచిక : 8 | 23-11-2020 | పుటలు : 4



## మంత్రి బాలినేని ని కలిసిన వీసీ

**మీడియా సెల్, 19.11.20:–** ఏపీ ఇంధన, అటవీ మరియు పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డిని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు మర్యాదపూర్వకంగా కలిసారు. గురువారం మంత్రి కార్యాలయంలో కలిసి విశ్వవిద్యాలయ అభివద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. పర్యావరణ పరంగా విశ్వవిద్యాలయాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దుతున్న విధానాన్ని వివరించారు. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ కోవిడ్ కాలంలో చేపట్టిన విజ్ఞాన కార్యక్రమాలు, వెబినార్ల విశేషాలను తెలియజేశారు. భూగర్భ శాస్త్రజ్ఞుడిగా తన అనుభవాలను సంబంధిత మంత్రిత్వ శాఖకు ఎప్పుడు అవసరమైన ఉపయోగించుకోవచ్చని చెప్పారు. సమాజ హితం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడానికి తన వంతు కృషి చేస్తానని అని తెలియజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి మరింత పాటుపడాలని వీసీకి అభినందనలు తెలిపారు.

## మనసు కవి
# ఆచార్య ఆత్రేయ





**మీడియా సెల్, 19.11.20:–** మనసు మర్మాలను తాను తెలుసుకొని సామన్యులకు అర్థమయ్యే భాషలో అందరి మనస్సులను ఆకర్షించిన మనసు కవి ఆత్రేయ అని, తెలుగు సాహిత్యానికి ఆత్రేయ విశేషమైన కృషి చేసారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు అన్నారు. విశ్వవిద్యాలయం సౌజన్యంతో మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్ వారి నిర్వహణలో సాహిత్య ఆచార్య ఆత్రేయ అనే అంశంపై అంతర్జాతీయ అంతర్జాల సదస్సును గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకులు ఆచార్య రంకిరెడ్డి రామమోహనరావు, సంచాలకులుగా డా.దొంతరాజు లక్ష్మీనరసమ్మ, డా.కె.వి.యన్.డి.వరప్రసాద్ వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు హాజరై ఉపన్యసించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో ఆచార్య ఆత్రేయ శత జయంతిని పురస్కరించుకొని చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఆచార్య ఆత్రేయగా సినీరంగ ప్రవేశం చేసిన కిళాంబి వెంకట నరసింహాచార్యులు బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. తెలుగులో నాటకాలు, నాటికలు రాయడంతో పాటు సినిమాలకు పాటలు, మాటలు రాయడమే కాక నిర్మాత, దర్శకులుగా కూడా రాణించారని తెలిపారు. దాదాపు 400 సినిమాలకు 1400 పాటలు రాసిన ఆయన తెలుగు సినీ చరిత్రతోపాటు, తెలుగు సాహిత్య చరిత్రలోను తనకంటూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని తెలియజేసారు. మనసుకవిగా సినిమా వారు పిలుచుకునే ఆత్రేయ నాటకాల్లో చక్కని ప్రయోగాలు చేసి నాటక రంగాన్ని మలుపుతిప్పారని చెప్పారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి, వెన్నెలకంటి, విశ్వవిద్యాలయ గేయ రచయిత డా. వెనిగళ్ల రాంబాబు, ఆత్రేయ శిష్యులు, సినీ గేయ రచయిత శ్రీ గురుచరణ్, ప్రముఖ సినీ కథా రచయిత శ్రీ జె.కె. భారవి, సినీ గేయ రచయిత శ్రీ చంద్రబోస్ తదితరులు ఆచార్య ఆత్రేయ సాహిత్య కృషిని వివరిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు, చక్రావధానుల రెడ్డప్ప ధవేజీ, పైడిపాల, ప్రముఖ సాహితీవేత్త అంబటి మురళీకష్ణ, డా. కలిదిండి రామచంద్రరాజు, ప్రముఖ కవి, సినీ గేయ రచయిత రసరాజు, ప్రముఖ సాహితీవేత్తలు డా.కందిమళ్ల సాంబశివరావు, శ్రీ వల్లూరు శివప్రసాద్. తెలుగు శాఖ ఆచార్యులు డా.దొంతరాజు లక్ష్మీనరసమ్మ, డా.కె.వి.యన్.డి.వరప్రసాద్, డా.తలారి వాసు, డా.టి.సత్యనారాయణ, ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుండి సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.


## డా.జి.వెంకట్రావుకు అరుదైన అవకాశం



**మీడియా సెల్, 20.11.20:–** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో మేథమెటిక్స్ అధ్యాపకులుగా పనిచేస్తున్న డా.జి.వెంకట్రావు జెఈఈ మెయిన్స్ పేపర్ సెటింగ్ 2021 కొరకు ఎంపికయ్యారు. దక్షణ భారతదేశం నుండి తొలిసారిగా జెఈఈ(జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) ఐటమ్ రైటింగ్ వర్క్ షాప్ కు నన్నయ అధ్యాపకుడు ఎంపిక కావడం హర్షనీయమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డా.జి.వెంకట్రావుకు అరుదైన అవకాశం దక్కిందని అన్నారు. తొలిసారిగా దక్షణ భారతదేశం నుండి జెఈఈ పేపర్ సెటింగ్ కొరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అధ్యాపకుడు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. డా.జి.వెంకట్రావు అంతర్జాతీయంగా 20 పరిశోధన పత్రాలను ప్రచురించారని, ఇంజనీరింగ్ లోని మేథమెటిక్స్ కు సంబంధించిన రెండు పాఠ్య పుస్తకాలను వ్రాసారని అన్నారు. డా.జి.వెంకట్రావుకు విద్యాపరంగా ఉన్న ప్రాధాన్యతను బట్టి జెఈఈ మెయిన్స్ పేపర్ సెటింగ్ కు ఎంపికయ్యారని తెలిపారు. నవంబర్ 08 నుండి 11వ తేది వరకూ డిల్లీలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పేపర్ సెటింగ్ కు వెళ్ళివచ్చారని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయంలో అనువజ్ఞులైన అధ్యాపకులు ఎందరో ఉన్నారని వారంతా తమతమ విభాగాలలో ప్రతిభను కనపరచాలని తెలిపారు. డా.జి.వెంకట్రావుకు రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరావు, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, బాలకష్ణ తదితరులు అభినందనలు తెలియజేసారు.

## సంపాదకీయం



# వెబినార్

వినిపిస్తుందా సర్ . . . . . కనిపిస్తున్నానా . . . . . ? ఆ. . ఆ. . వినిపిస్తుంది . . . కనిపిస్తున్నారు. . . చెప్పండి సర్ . . . !

– ఈ మాటలు ఈ మధ్య ఎక్కువగా వింటున్నాం. గూగుల్ మీట్ , జూమ్ . . . ఇలా మన సమావేశాలు, సదస్సులు దిగ్విజయంగా సాగిపోతున్నాయి. కోవిడ్ – సెమినార్లని వెబినార్లుగా మార్చింది.

టిఫిన్లు, భోజనాలు, బొకేలు, మెమెంటోలు, శాలువాలు, సన్మానాలు, బేనర్లు, బిల్లులు . . చిరాకులు, పరాకులు, కోపాలు, తాపాలు . . . ఇవేమీ లేని కేవలం విషయం మాత్రమే మాట్లాడే, సూచించే, ఉపన్యసించే వెబినార్లు – సదస్సులు – మీటింగులు హాయిగా జరుగుతున్నాయి. ఎవరింట్లో, ఎవరి ఆఫీసులో, ఎవరి చోటులో వారు కూర్చుని ప్రపంచం నలుమూలలనుంచీ మొబైల్లో, కంప్యూటర్‌లో చూస్తున్నారు. వింటున్నారు. మాట్లాడుతున్నారు.

అందరికీ తెలిసిన మాట ఒకటుంది. చీకటిని తిడుతూ కూర్చునేకంటే, చిన్న దీపాన్ని వెలిగించమని. లాక్‌డౌన్‌లో మన పనులన్నీ ఆగిపోయాయి. మనం ఎక్కడికీ కదలటానికి లేదు. పుస్తకాల్ని చదవొచ్చు. టి.వి. చూడొచ్చు. మరి భావ ప్రసారం, అనుభవాల్ని అందించటం, విజ్ఞానాన్ని పంచటం, ఒక విషయంలో లోతుపాతుల్ని చర్చించటం, కొత్త పరిశోధనలకి మార్గాల్ని వేయటం ఎలా? మనిషి స్తబ్దంగా ఉండిపోలేడు. ప్రగతి కాముకుడు. తాను సృష్టించుకున్న ఇన్వెన్షన్ – జూమ్, గూగుల్ మీట్ . . . మరొకటి, మరొకటి. గులాబీని మరేపేరుతో పిలిచినా, అది సువాసనలే వెదజల్లుతుందన్నారు షేక్స్పియర్ . విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలు ఆరుమాసాల్లో 60 వెబినార్లు నిర్వహించిన ఘనత రాష్ట్రంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికే దక్కుతుంది. వెబినార్లు, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. అనుబంధ కళాశాలలన్నీ ఎన్నో విలువైన విషయాలపై కార్యక్రమాల్ని నిర్వహించాయి. విద్యలో, పరిశోధనలో స్తబ్దతను జయించాయి.

అపరిమితమైన శక్తి గల ఇంజన్‌తో ట్రైన్ స్టేషన్లో నిలబడి ఉంటుంది. విజిల్ వేసినపుడో, పచ్చజండా ఊపినపుడో అది కదులుతుంది. అది కదలటానికి గల గొప్ప ప్రేరణను, అనుమతిని అవి ఇస్తున్నాయి. ఏ ప్రేరణ లేకుండా నాదం ఎలా పలుకుతుంది. చెక్కనిదే శిల కదుపున శిల్పమెలా పుడుతుంది. నడిపించే చైతన్యం లేనిదే నడవదు ఈ సృష్టి !

గొప్ప ప్రేరణను, చైతన్యాన్ని అందించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గారికి, కులసచివులు ఆచార్య బట్టు గంగారావు గారికి, అధికార యంత్రాంగానికి అభివాదాలు !!

**ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రేరణ కలిగించే ఒక ప్రయోజనం మనల్ని ముందుకు నడిపిస్తున్నప్పుడు, ప్రతి నిమిషాన్ని సార్థకం చేసుకోవచ్చు . తద్వారా చరిత్రను సృష్టించవచ్చు .**

**శుభమస్తు !!**

# ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ పై వెబినార్

వీసీ మొక్కా జగన్నాథరావు



ఐఓటి బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ

**మీడియా సెల్, 20.11.20:–** ఈ నెల 27న రిసెర్చ్ ఇష్యూస్ ఇన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై అంతర్జాతీయ వెబినార్ ను ఆన్ లైన్ ద్వారా నిర్వహిస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రిసెర్చ్ ఇష్యూస్ ఇన్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై అంతర్జాతీయ ఆన్ లైన్ వెబినార్ ను నిర్వహిస్తున్నారని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. దీనికి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అధ్యాపకులు టి.త్రిత్వజ్యోతికిరణ్ కన్వీనర్ గా, వెబ్ మాస్టర్ ఎం.శ్రీనివాసరావు కోకన్వీనర్ గా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రధాన వక్తలుగా జె.ఎన్.టి.యూ. హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎ.కవిత, సొల్యూషన్ అర్కిటెక్ట్ ఐఓటి సింగపూర్ చాగంటి సురేష్ నాయుడు ఉపన్యాసాలు అందిస్తారని తెలిపారు. ఫ్రీ రిజిస్ట్రేషన్ తో ఈ వెబినార్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్సైట్ లేదా jyothi.cse@aknu.edu.in సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరరావు, కన్వీనర్ టి.త్రిత్వజ్యోతికిరణ్, కోకన్వీనర్ ఎం.శ్రీనివాసరావు, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# 23 నుండి 27 వరకు నన్నయలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్

**మీడియా సెల్, 21.11.20:–** ఈ నెల 23 నుండి 27 వరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయం ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కు సంబంధించిన వివరాలను వీసీ వెల్లడించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు డిపార్ట్మెంట్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మరియు మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23 నుండి 27వ తేది వరకు ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ను నిర్వహిస్తున్నామని చెప్పారు. కేస్ డిస్కషన్ మెథడాలజీ అనే అంశంపై జరిగే ఈ ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమానికి కన్వీనర్లుగా మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఆచార్య చేతన్, నన్నయ విశ్వవిద్యాలయ మేనేజ్మెంట్ నుండి ఆచార్య ఎస్.టేకి వ్యవహరిస్తున్నారని తెలిపారు. అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని వీసీ తెలియజేసారు.

# డా. ఉమర్ ఆలీషా సాహిత్యంపై వెబినార్



తెలుగు వెబినార్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ


**మీడియా సెల్, 21.11.20:–** ఈ నెల 24 నుండి 26 వరకు మహాకవి డాక్టర్ ఉమర్ ఆలీషా సాహిత్యం – ఔపదేశికత్వం పై అంతర్జాతీయ అంతర్జాల సదస్సును నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో శనివారం దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం, పిఠాపురం వారి సహకారంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ మరియు మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్, అయితంపూడి సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారని తెలిపారు. సదస్సు సంచాలకులుగా డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, నిర్వహాకులుగా ఆచార్య రంకిరెడ్డి రామమోహనరావు వ్యవహరిస్తున్నారని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో శతాబ్దాలుగా ఆధ్యాత్మిక పీఠంగా విలసిల్లుతున్న శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠానికి 6వ పీఠాధిపతియైన కవివర్యులు బ్రహ్మర్షి డాక్టర్ ఉమర్ ఆలీషా అని అన్నారు. బహుభాష కోవిదుడుగా ఉమర్ ఆలీషా సాహిత్య లోకానికి చేసిన కృషిని వెల్లడించేందుకు ఇది చక్కని వేదిక అని అన్నారు. సాహిత్యాభిమానులు, తెలుగు భాషాభిమానులు ఈ మూడు రోజుల అంతర్జాతీయ వెబినార్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు డాక్టర్ ఉమర్ ఆలీషా సాహిత్యంపై మూడు రోజుల పాటు చక్కని వెబినార్ ను నిర్వహిస్తున్న నిర్వహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సదస్సు సంచాలకులు డా.కె.వి.ఎన్.డి. వరప్రసాద్, నిర్వహకులు ఆచార్య రంకిరెడ్డి రామమోహన రావు, విభాగాధ్యాపకులు డా.తలారివాసు, డా.టి.సత్యనారాయణ, డా.లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.



# విద్యార్థి లోకం



## పుస్తకం



### ఏడు తరాలు (ROOTS)

అలెక్స్ హేలీ ఇంగ్లిష్‌లో రాసిన నవల 'రూట్స్'. దీన్ని 'ఏడు తరాలు' పేరుతో సహవాసి తెలుగులోకి అనువదించారు. ఇందులో కుంటా కింటే అనే ఆఫ్రికా యువకుణ్ని అమెరికావాసులు కిడ్నాప్ చేసి బానిసల వేలంపాటలో అమ్మివేస్తారు. అమెరికాలో దుర్భర బానిస జీవితం గడిపే కుంటా రోదన ఒకవైపూ, కొడుకు ఏమయ్యాడో తెలియని తల్లిదండ్రుల వేదన మరోవైపూ మనల్ని కంటతడి పెట్టిస్తాయి. 16, 17వ శతాబ్దాలలో యూరప్, అమెరికావాళ్లు ముందస్తుగా పారిశ్రామిక విప్లవం సాధించి, ఇతర దేశాల ప్రజలందరినీ ఎలా ఏడిపించారనే దానికి ఈ నవల బలమైన సాక్ష్యం.

కుంటా బానిస జీవితం గడుపుతూ తోటి బానిస స్త్రీ బెల్ ను వివాహం చేసుకుంటాడు. పుట్టిన కూతురికి వాళ్ల జేజమ్మ పేరు కిజ్జీ అని పెట్టుకుంటాడు. బానిస జీవితాన్ని ఏవగించుకుంటూనే జీవితాన్ని ప్రేమించడం మొదలుపెడతాడు. కానీ అమెరికా శ్వేత జాతీయులు కుంటా జీవితంలో మరోసారి నిప్పులు పోస్తారు. కిజ్జీ ఎవరినో ప్రేమించి బానిస జీవితం నుంచి తప్పించుకోజూసిందని అందుకు శిక్షగా ఆమెను తండ్రి నుంచి దూరం చేసి బానిసల గుంపుతో దూరప్రాంతానికి పంపిస్తారు. బలవంతుల దుర్మార్గానికి చిన్నప్పుడే తల్లిదండ్రులకు దూరమై, ఇప్పుడు అదే దుర్మార్గుల వల్ల కన్నకూతురు దూరమవుతుంటే గుండె పగిలి కుంటా నిర్జీవుడైపోతాడు.

కథ అంతటితో ఆగదు. కిజ్జీ ఇంకో శ్వేత జాతీయుడికి ఉంపుడుగత్తెగా కొడుకు జార్జ్‌ను కంటుంది. జార్జ్ కూడా బానిసగా పెరిగి పెద్దవాడై, మద్యపానం, కోళ్లపందేలు వంటి వ్యసనాలతో జీవిస్తాడు. కోళ్ల జార్జ్ అని పేరు తెచ్చుకుంటాడు. ఆయన పిల్లల్లో ఒకడు టామ్. టామ్ పెరిగేనాటికి అబ్రహాం లింకన్ అమెరికా అధ్యక్షుడు అవుతాడు. మనుషులంతా ఒక్కటేనని బానిసత్వాన్ని రద్దు చేశాడు. దీన్ని సహించలేని ప్రత్యర్థుల చేతిలో హత్య గావించబడ్డాడు. లింకన్ పుణ్యమా అని లక్షల మంది ఆఫ్రికన్ అమెరికన్లు బానిసత్వం నుంచి విముక్తి పొందారు. టామ్‌కు కూడా స్వేచ్ఛ లభించింది.

టామ్ వడ్రంగిగా జీవితం కొనసాగించి ఎనిమిది మంది పిల్లల్ని కంటాడు. అందులో ఒక కూతురు సింథియా. ఈమె కూతురు బెర్తా. ఈమె కొడుకు ఎలెక్స్ హేలీ. ఈ హేలీ తన జీవిత మూలాలను వెతుక్కుంటూ ఆఫ్రికా వెళ్లి 17వ శతాబ్దం నాటి తన తాతల ముత్తాత కుంటా జీవితాన్ని 19వ శతాబ్దంలో మన ముందుంచాడు. ఈ పుస్తకం చదివిన తరవాత మనకు తెలిసే విషయం ఏమిటంటే, **జ్ఞానం వున్న ప్రతివాడూ ధర్మాత్ముడు కాలేడు. కాని దయగల ప్రతివాడూ ధర్మాత్ముడవుతాడు. ప్రపంచానికి జ్ఞానం అవసరమే కానీ దయలేని జ్ఞానం వల్ల కీడే కానీ మేలు జరగదనీ, కావున మనిషన్నవాడు దయ కలిగి వుండాలనీ** ఈ పుస్తకం సందేశాన్ని ఇస్తుంది.

## ఆదికవి టూ అమెరికా




### స్ఫూర్తి

**ఆ**దికవి నన్నయ యూనివర్శిటీలో ఎమ్.ఎస్.సి జువాలజీలో ఎడ్మిషన్ రావడం ఆనందం కలిగించింది. కాంపస్ లో ఎడ్మిషన్ (2009) కోసం ఫ్రెండ్స్ దగ్గర గొప్పగా చెప్పుకున్నాను. కాంపస్ లేదుగా అని ఫ్రెండ్స్ నాపై జోక్స్ వేసారు. స్కూల్ లైఫ్ అండ్ హెల్త్ సైన్స్ ఫాకల్టీ (ఎస్.ఎల్.హెచ్.ఎస్) బి.ఎస్.సి వరకు తెలుగు మాధ్యమంలో చదవడం వలన మొదట్లో కొద్ది భయం వేసింది. ఎస్.ఎల్.హెచ్.ఎస్ ఫాకల్టీ అందరిలోను భయాన్ని పోగొట్టి, అందరికీ అర్థమయ్యేలా చెప్పేవారు. యూనివర్శిటీ లైబ్రరీలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ బుక్స్ ఉండటం ఒక ప్లస్ పాయింట్. క్లాస్‌రూంలో చెప్పిన పాఠాలు తర్వాత లైబ్రరీకి వెళ్ళి బుక్స్ రిఫర్ చేయమని ఎసైన్‌మెంట్స్ ఇచ్చేవారు. అలా నాకు సైన్స్ మీద బాగా ఆసక్తి పెరిగింది. దానికి తోడు విశ్వవిద్యాలయంలో ఉండే ఇంటర్నెట్ ఫెసిలిటీని నేను బాగా ఉపయోగించుకున్నాను. రీసెర్చి ఆర్టికల్స్ డౌన్‌లోడ్ చేసుకుని క్లాస్‌లో చెప్పిన పాఠాలను రిలేటెడ్ రీసెర్చి ఆర్టికల్స్ అండ్ మోడల్స్ కోసం చదవడం జరిగింది. డా॥ ఎ.మట్టా రెడ్డిగారు అనూర్ ఎస్.ఎల్.హెచ్.ఎస్ కి గొప్ప వరం. స్టూడెంట్స్ క్లాస్‌రూం దాటి పాఠాలుతోపాటు లైఫ్ స్కిల్స్‌కి సాయం చేసే పర్సన్. ఆయన క్లాసులో పాఠాలు మధ్యలో 'ఈ కెమికల్ కొరియాలో వాడాను. రియల్‌గా ఈవర్క్ యు.ఎస్.ఎ లో చేసాను' అని చెప్పడం నాకు ఇంకా గుర్తు ఉంది. నేను అలా చేయాలి అనుకున్నాను. కలలు కనేవాడిని.

డా॥ కె. రమణీశ్వరి మేడం గారు లైఫ్ సైన్స్ అన్ని స్టాండర్డ్ బుక్స్ నుండి చెప్పేవారు. చాలా క్లియర్‌గా అందరికీ అర్థం అయేలా మేడం గారు చెప్పిన జనటిక్ లెసన్స్ ఇప్పటికీ కళ్ళముందు ఉన్నాయి. ఒకరోజు సడన్‌గా నన్ను జెనెటిక్స్ లో జెనెటికల్ ముటెసన్స్ మీద పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వమని చెప్పారు. ఆ ప్రజంటేషన్‌కి లైఫ్‌సైన్స్ అన్నితరగతులు అటెండ్ అయ్యారు. అలా నన్నెందుకు ఇవ్వమన్నారో కొరియా పి.హెచ్.డి చేసిన తరువాత నాకర్థమయింది.

డా॥ కళ్యాణి మేడం గారు చాలా స్ట్రిక్ట్‌గా క్లాసులు చెప్పేవారు. నేను ఇంటర్నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న ఆర్టికల్స్‌ని మేడం గారి దగ్గరకు తీసుకెళ్ళేవాడిని. అవి క్లాసు లెసన్స్‌లో లేకపోయినా చాలా ఓపికగా కరెక్షన్స్ చేసేవారు. మేడం చెప్పిన ఫిజియాలజీ పాఠాలు బాగా ఆసక్తి కలిగించాయి. నా పి.హెచ్.డి లో కార్డియాక్ ఎలిక్ట్రోపిక్ చేయడానికి బాగా ఉపయోగపడ్డాయి.

డా॥ పి.విజయనిర్మల మేడం గారు చెప్పే ప్రతి క్లాస్ చాలా ఆసక్తిగా ఉండేది. బయోకెమిస్ట్రీ ప్రతీ క్లాసు చాలా ఆసక్తిగా ఉండేది. బయోకెమిస్ట్రీ లెసన్సు ఇప్పటికీ గుర్తున్నాయి. పి.హెచ్.డి లో డ్రగ్ ఇన్వెస్టిగేషన్స్ కి బాగా ఉపయోగపడ్డాయి. అప్పట్లో కాంపస్ లేకపోయినా, కొన్ని డిపార్టుమెంట్స్ మాత్రమే అయినా అన్ని క్లాసులు వాళ్ళు అన్న, తమ్ముడు చెల్లి అని ర్యాగింగ్ లేకుండా కలిసి చదువుకున్నాము. క్లాసు రూంలో లెసన్సుతో పాటు ఆర్ట్స్, ఆటపాటలు బాగా ఉండేవి. చదువుతో పాటు బాధ్యతలు నేర్పింది అనూర్ కాంపస్. అలా 2011 లో ఎమ్.ఎస్.సి. జువాలజీ కంప్లీట్ అయింది. అప్పటినుండి ఒక ప్రైవేట్ స్కూల్‌లో పార్టు టైం టీచర్ గా పని చేస్తూ పి.హెచ్.డి చేస్తూ ఉండేవాడిని. దానికి మట్టారెడ్డిగారు బాగా సాయం చేసారు. 2012 జనవరిలో చేంజ్‌మన్ నెహ్రూ యూనివర్శిటీ లో రీసెర్చి అసిస్టెంటుగా స్టార్ట్ చేసి 2013 లో చేంజ్‌మన్ నెహ్రూ యూనివర్శిటీ, ఫార్మసీ డిపార్టుమెంటులో పి.హెచ్.డి జాయిన్ అయ్యాను. 2016 లో పి.హెచ్.డి అవార్డు అయింది. పి.హెచ్.డి అయిన వెంటనే యూ.ఎస్.ఎ లో యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడా లో పోస్ట్ డాక్టోరల్ ట్రెనింగ్ జాయిన్ అయ్యాను. ఏట్రియల్ ఫైబ్రిల్లిషన్ హైపర్ ట్రాఫిక్ కార్డియోమయోపతికి పెప్టీ బాడీ మరియు మైట్రో కండ్రియల్ ట్రీట్మెంట్ కనుగొనడం జరిగింది.



ఈ పరిశోధనలకు అమెరికా హార్ట్ అసోసియేషన్ వారు అవార్డు ఇవ్వడం విశేషం. పోస్ట్ డాక్టోరల్ వర్క్ ని జర్నల్ ఆఫ్ సెల్ ఫిజియోలజీ, ఫ్రాంటియర్స్ ఇన్ ఫార్మకాలజీ, సెల్, అమెరికాన్ జర్నల్ ఆఫ్ ఫిజియోలజీ లలో ప్రచురణ చేయడం జరిగింది. ప్రస్తుతం నేను రిసెర్చ్ సైంటిస్ట్ గా ప్రమోట్ అయ్యాను. కొన్ని యూనివర్సిటీస్ నన్ను ప్రొఫెసర్ జాబ్ కి షార్ట్ లిస్ట్ చేసినవి. కొన్ని వాటికి ఇంటర్వ్యూ ఇచ్చాను. ప్రొఫెసర్ గా ఉత్తమ పరిశోధనలు చేసి గుండె సంబంధమైన వ్యాధులకు మంచి ఔషధాన్ని కనిపెట్టాలనే లక్ష్యంతో పని చేస్తున్నాను. **విద్యార్థి దశలో లక్ష్యసాధనతో పయనించాలని నా జూనియర్స్‌కు సూచిస్తున్నాను.**

**పూర్వవిద్యార్థి – డా. చిడిపి బుజ్జిబాబు**
**రిసెర్చ్ సైంటిస్ట్, యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడా, అమెరికా**

### మంచి మాట

**సుఖార్థీ త్యజతే విద్యాం**
**విద్యార్థీ త్యజతే సుఖం ।**
**సుఖార్థిన్న కుతో విద్యా**
**కుతో విద్యార్థి న్న సుఖం ॥**

సుఖాన్ని కోరేవాడు విద్యను వదులుకోవలసిందే. విద్యనే కోరువాడు సుఖాన్ని త్యజించవలసిందే. సుఖపడే విద్యార్థికి విద్య ఎలా లభిస్తుంది? **సుఖాల్ని వదిలిన విద్యార్థియే విజయుడవుతున్నాడు.**

# ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

## ప్రాంగణ కళాశాలల విశేషాలు

## యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్




ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాగణంలో నాలుగు కళాశాలలు ప్రధానమైనవి. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, విద్యా కళాశాల(ఉపాధ్యాయ శిక్షణ) ఈ సంచికలో ఇంజనీరింగ్ కళాశాలలోని విభాగాల విశేషాలు. విశ్వవిద్యాలయ ప్రారంభం నుంచి నెలకొల్పిన కోర్సులతో 2006 నుండి ఒకే కళాశాలగా ఉన్న విధానాన్ని అనేక కొత్త కోర్సులు, విభాగాలు ఏర్పాడిన తరువాత 2013 నుండి ఈ కళాశాలలు ప్రత్యేక వ్యవస్థలుగా ఏర్పాడ్డాయి. జెగేట్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నాణ్యమైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా పొందే సదుపాయం ఉంది. విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంధాలయంలో అన్ని విభాగాలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఎన్.ఎస్.ఎస్, స్పోర్ట్స్, యోగా విభాగాలలో ఇంజనీరింగ్ విద్యార్థులు తమ ప్రతిభను కనపరుస్తున్నారు. విద్యార్థులకు హాస్టల్, యూనియన్ బ్యాంక్, హాస్పటల్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. యూజీసీ కొన్ని సర్టిఫికెట్టు కోర్సులను ఈ ఏడాది నుండి అందిస్తుంది.









### కోర్సుల వివరాలు

| | | |
|---|---|---|
| బి.టెక్ సి.ఎస్.ఈ. | - 2016, | సీట్లు - 60 |
| బి.టెక్ ఈ.సి.ఈ. | - 2017, | సీట్లు - 60 |
| బి.టెక్ ఈ.ఐ.ఈ. | - 2016, | సీట్లు - 30 |
| బి.టెక్ మెకానికల్ | - 2019, | సీట్లు - 60 |
| బి.టెక్ సివిల్ | - 2019, | సీట్లు - 60 |
| ఎం.సి.ఏ | - 2006, | సీట్లు - 45 |

### కళాశాల ప్రత్యేకతలు

| | |
|---|---|
| ఆచార్యులు సంఖ్య | - 29 |
| జాతీయ సదస్సుల సంఖ్య | - 22 |
| అంతర్జాతీయ సదస్సుల సంఖ్య | - 8 |

డిపార్ట్‌మెంట్ క్లబ్స్, అలుమ్ని

ఎంట్రప్రైన్యూర్షిప్ ఆఫ్ ఇన్స్టుమెంటేషన్ క్లబ్

అర్చన రఘువంశి మెమోరియల్ లైబ్రరీ

### ల్యాబ్స్

| | |
|---|---|
| కంప్యూటర్ ల్యాబ్స్ | - 3 |
| వర్క్ షాప్ | - 1 |
| డ్రాయింగ్ ల్యాబ్ | - 1 |
| ఫిజిక్స్ ల్యాబ్ | - 1 |
| కెమిస్ట్రీ ల్యాబ్ | - 1 |
| ఎలక్ట్రానిక్స్ డివైజస్&సర్క్యూట్ ల్యాబ్ | - 1 |
| ఇండస్ట్రీయల్ ఇన్స్టుమెంటేషన్ ల్యాబ్ | - 1 |



**డాక్టర్ వి.పెర్సిస్**

**ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్**

విశ్వవిద్యాలయంలో కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. బిటెక్ పూర్తి చేసిన మొదటి బ్యాచ్ విద్యార్థులు టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో, మైండ్ ట్రీ మరియు వివిధ సాఫ్ట్ వేర్ రంగాలలో ఉద్యోగాలను సంపాదించుకున్నారు. యూనివర్సిటీ ప్లేస్మెంట్ ఆఫీసర్ మరియు విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరరావు, డిపార్ట మెంట్ ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావులు విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ తరుపున సాఫ్ట్ వేర్ టెక్నాలజి పార్క్‌ను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇండస్ట్రీయల్ కొలబ్రేషన్ తో సంస్థాగతంగాను, వ్యక్తిగతంగాను ఆర్థికాభివద్ధికి మార్గాలను చూపుతున్నాం. ఉన్నత్ భారత అభియాన్ లో భాగంగా ఐదు గ్రామాలను దత్తత తీసుకుని సర్వేలను, కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. విద్యార్థులందరికి ఉద్యోగ, వ్యాపార, ఉపాధి అవకాశాలను అందిస్తూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌ను మరింత అభివద్ధి పరచే పనిలో ఉన్నాం.



(ఇవి 2020-2021 విద్యాసంవత్సరం నవంబర్ నాటికి వివరాలు)







